


పడమటికొండమీద పేదరాశిపెద్దమ్మ కుంపటి పూర్తిగా ఆరిందో లేదో కాని, ఆ పక్కంతా కందిపోయింది. పారాణి రాసుకున్న కొత్త పెళ్ళికూతుళ్ళలా ఆకాశంమీద మబ్బుతునకలు పొరలాడుతున్నాయి. మసకచీకటి ముంచుకొచ్చేస్తోంది.

"రావే అమ్మాయ్, శాస్తుల్లుగారు పురాణం చెబుతున్నారు వెళదాం"


అంది మా అమ్మ. నాలుగేళ్ళ తరవాత మళ్ళీ వున్నవూరికీ, కన్నవారింటికీ వచ్చేనేమో – మా వాళ్ళందరినీ ఓమారు చూడాలనిపించింది. అందరి మాట కేం గాని మా విశాలాక్షితో కరువుతీరా కబుర్లు చెప్పుకోవాలని, దాని మొగుడూ ముచ్చటా చూదామనీ నా మనసు వుబలాటపడింది.

"మన విశాలా క్షేలావుందే అమ్మా?" అన్నాను.

"దానికేఁవీఁ... నిక్షేపంలా పురటాలై దబ్బపండులాంటి కొడుకు నెత్తుకుంది. పోనీ నువ్వలా వెళ్ళిరారాదూ"

అంది మా అమ్మ. ఆ మాటకోసఁవే ఎదురుచూస్తున్నాను. సరేనని బయ లేరేను. విశాలాక్షీ, దాని మొగుడూ, నేనూ ఆ వూళ్ళోనే పుట్టిపెరిగేం దాని పుట్టినిల్లూ, మెట్టినిల్లూ ఆ వూళ్ళోనే వున్నందుకు అదెంత అదృష్టవంతు రాలో అనుకున్నాను. దాని పెళ్ళికి నేను రాలేకపోయేను. అదెంత నొచ్చుకుందో అని నేనెంత బాధపడ్డానో తెలియజేస్తూ, క్షమించమని ఉత్తరమేనా రాద్దా మను కున్నాను. మొద్దుమొహానికి ఒక్క అక్షరమ్ముక్కేనా రాదు. ఏం చెయ్యను. ఆ ప్రయత్నంకూడా విరమించు కున్నాను. నాలుగేళ్ళకి మళ్ళీ దాన్ని చూస్తున్నాను. ఏం దెప్పుతుందో అని భయపడుతూ కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళేను. నట్టింట్లో గుడ్డిదీపం దిగులు దిగులుగా మినుకు మినుకు మంటోంది. ఇంట్లో మనిషిజాడ లేదు. ఇరుగుపొరుగు యిళ్ళు కూడా అలాగే వున్నాయి. ఆ సమయంలో అక్కడక్కడ సాలిగూళ్ళు వేలాడుతూ ఆయిల్లూ, మడ్డితసం అబ్బిన గుడ్డిదీపం కాంతీ అన్నీకలిసి కూలిపోయిన ఒకనాటి పచ్చటిసంసారంలా కనిపించేయి. 'ఛఛ, శుభమా అని పిల్లాపాపలతో చిల్లోబొల్లో మని వాళ్ళుంటే ఏఁవిఁటీ ఆలోచనలని నామీద నాకే కోపఁ వొచ్చింది. నన్ను నేనే తిట్టుకుంటూ లోపల కాలుపెట్టేను. పురిటిమంచంమీద బ్రహ్మదేవుడు తప స్సమాధిలో ఏం చూసేడో కాని పెదవుల మీద చిరునవ్వుముద్ర చెదరకుండా హాయిగా నిశ్చింతగా బబ్బున్నాడు. మంచంపక్కనే ఉయ్యాల బల్లమీద కూచొని పండుతమలపాకులు యీనెలు తీసుకుంటూ, మధ్య మధ్య సున్నం రాసు కుంటూ, చిలకలు చుట్టుకొని నోట్లో పెట్టుకుంటూ తలెత్తి ఎవరో పిలిచినట్టు వీధిగుమ్మంవేపు చూసింది. "ఇదేఁవిఁ టేవ్ జానకీ... అయ్యో నామతిమండా.. ఏదో ధ్యాసలోపడి చూడనేలేదూ ... ఎప్పుడే రాక?... అలా నిలబడిపో యేవేం?... లోపలికి రావే; కూచోవే."

అంటూ కంగారుగా లేచి ముందు కొచ్చి నా రెండుచేతులూ పట్టుకొని లోపలికి లాక్కొనిపోయింది. ఆ క్షణంలో అట్లతద్దినాడు పరికిణీలు కట్టుకొని నేనూ అదీ చేతులు జోడించి రివ్వున తిరిగిన ఒప్పులగుప్పలు నా మనస్సులోనూ, నా కళ్ళల్లో నీళ్ళు ఒక్కసారు గిర్రున తిరిగాయి— పట్టపగ్గాలులేని అభిమానానికి వరదలొచ్చినట్టు. నన్ను గట్టిగా చుట్ట బెట్టేసుకుని నా భుజంమీద వాలిపోయి నా పైటనీ, దానికింద రవికనీ వెచ్చ వెచ్చగా తడిపేసింది. మా మనసులు మూగవైపోయేయి. మేం ఆ క్షణంలో




మాటలు మరిచిపోయేం. ఉయ్యాలబల్ల మీద కూచున్నాం. పైటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ దీప కళికలా కళకళ లాడుతూ కిలకిల నవ్వింది విశాలాక్షి. అసలే అది కాచిన కుందనపు బొమ్మ. అందులో పురటాలు. ఆడదానికి దేవు డిచ్చిన ఒకే ఒక్క వరంలా దాని మెడలో నల్లపూసలు నిగనిగ లాడిపోయేయి.

"ఏఁవేఁ జానకీ... యిన్నాళ్ళకి చే పుట్టింటి కొస్తావు... మీ ఆయన వెళ్ళొద్దన్నాడా... లేక నువ్వే యీ పల్లెటూళ్ళ మొద్దుల్ని చూసేదేఁవిఁటిలెద్దూ అని విసుగెత్తి రావడం మానేశావా ?— అయినా మేం ఎలా జ్ఞాపకం వుంటాంలే అమ్మా?"

తనపెళ్ళికి రాలేదేఁవఁని సూటిగా అడక్కుండా నర్మగర్భంగా చెప్పిపొడిచింది విశాలాక్షి. అమ్మ గడుసుదానా అనుకున్నాను.

"బాగుందే నీ మాటలూ నువ్వూను.. ఆయన వెళ్ళొద్దంటేమాత్రం నే నుండిపోతానా ఏం ... నాకుమాత్రం రావాల్నుండదూ...ఆడాళ్ళకి పుట్టింటారిమీద ఆమాత్రం ఆశ వుండదే." అన్నాను, నేనూ ఆ ప్రసక్తి తీసుకురాకుండా.

"మరొతే యిన్నాళ్ళూ ఎందుకు దిగబడలేపో దొరసానిగారు."

"ఏఁవిఁటోనే అలా ఐపోయింది... ఊఁ అంటే ఆఁ అంటే బదిలీలు, మాటిమాటికీ కేంపులు... ఏం వుద్యోగాల్లేవే.. వెధవనౌకరీలు... ప్రాణం హైరానబడిపోతోంది. ఆయన చూస్తే ఒంటిమనిషా.. అటూ యిటూ ఎవరూ లేరాయె. ఎవరి కప్పజెప్పి రమ్మంటావు చెప్పు ?"

"ఆ పనిమాత్రం చెయ్యకే...అప్పజెప్పడఁ వేఁవిఁటే జానకీ... మంచి దానివే, యింకా నయం... అప్పజెప్పకే

బాబూ. ఎవరికీ అప్పజెప్పకే... మొగుళ్ళంటే గాలికి ఒరిగిపోయే దీపాలు. వాలిపోకుండా, ఆరిపోకుండా పైటచెరగులతో మడి గట్టి కాపాడుకోవాలి."

అంటూ నావేపు చూసి కొంటెగా నవ్వింది. ఇంత హాస్యం ఎలా అబ్బిందా దానికని ఆశ్చర్యబోయేను. నవ్వుతున్నపుడు దాని బుగ్గలమీద పడ్డ సొట్టలు నన్నాకర్షించేయి. వాటి అందాల్ని చిన్నతనంనుండి చూస్తున్నాను. అవిప్పుడు సుడిగుండాల్లా వున్నాయి. వాటి లోతులకన్న దానిమాటలు మరీ లోతైనవిగా కనుపించేయి. దాని హాస్యంలో వున్న ఆప్యాయత చూసి మురిసిపోయేను. దీనికింత నిండుతనఁవెలా వచ్చిందా అని విస్తుబోయేను. నా సంసారం గురించి ఒక్క మాటేనా అడగదేం? నేనే చెబుతాననిలా వుంది దానూహ. దాని కాపరం ఎలా వుందో తెలుసుకోవాలనుంది. అదడగలేదుకదా, నే నడిగితే ఏం బాగుంటుందని అనుమానించేను. అయినా దానికీ నాకూ ముందువెనకలూ, లాంఛనాలూ యేఁవిఁటిలే అనుకున్నాను. ధైర్యం చిక్కపట్టుకుందామని దానివేపే కళ్ళప్పగించి చూస్తున్నాను.

"ఏఁవిఁటే అలా గుడ్లప్పగించి చూస్తావూ... ఏఁవిఁటాలోచిస్తున్నావు? పాపం. ఒంటిగా మీ ఆయన ఏం యిబ్బందులు పడుతున్నాడో... చెయ్యి కాల్చుకుంటున్నాడో అనా?" అని చమత్కారంగా గదమాయించింది.

"అబ్బే... ఏఁవీఁలేదే... నే నేఁవీఁ ఆలోచించటంలేందే" అంటూ కళవళబడి తప్పించుకోబోయేను.

"అబద్ధా లెందుకే?... నా దగ్గర దాచకే... చెప్పవే."

"ఏం చెప్పమంటావే?"

"పోనీ చెప్పొద్దు...దాచుకో;" అని మూతి ముడుచుకుంది. నే నెందుచేతో ఏఁవీఁ మాట్లాడలేక పోతున్నాను. ఎన్నెన్నో కబుర్లు చెబుదామని వచ్చేను. ఒక్కముక్క వూడిపడదేం? విశాలాక్షిని చూడగానే నా నోటికి తాళం పడిపోయింది. మహిళాసభలలో ఎన్నో వుపన్యాసా లిచ్చిన నేను విశాలాక్షిముందు నోరు మెదపలేకపోయేను. నా చదువంతా ఏఁవఁయిందో కాని ఒక్కమాట రాపడంలేదు. సిగ్గుపడిపోయేను. ఏదో మాట్లాడబోయి –

"నీ కాపరఁవెలా వుందే విశాలాక్షీ" అని అకస్మాత్తుగా అనుకోకుండా అనేసి సద్దుకోబోయేను. పురిటిమంచంమీద గుప్పిళ్ళు బిగిస్తున్న పసివాణ్ణి తీసుకొచ్చి పొత్తిళ్ళు సవరిస్తూ నా కందించింది. తాటిముంజెల్లాంటి కన్నురెప్పలు విప్పి నావేపొకసారి చూసేడు వాడు. 'ఆఁ... వీళ్ళతో మన కేఁవిఁటని' మళ్ళీ కళ్ళు మూసేసుకున్నాడు. ఇద్దరం నవ్వుకున్నాం.



"నీ పెళ్ళికి రాలేకపోయేనే విశాలాక్షీ... ఎంత విలవిలలాడిపోయేనో ఆ దేవుడికే తెలుసు," అన్నా ననందర్భంగా.

"పోనీలేవే, పిల్లా ణ్ణెత్తుకున్నప్పుడేనా వచ్చే పంతే చాలు."

"గుమ్మడిపండులా వున్నాడే నీ కొడుకు."

"అదేఁవిఁటే, మీ అమ్మ దబ్బపండులా వున్నాడంటే!"

"నీ కెలా వున్నాడేం?"

"నా కొడుకులా వున్నాడు."

"ఆఁ... నీ మొగుడులా లేడూ?"

అతితెలివిగా దెబ్బ తీసే ననుకున్నాను. దానిమొహం చిన్నబోయింది. ఆ దెందుకలా ఐపోయిందో బోధపడక తికమకపడ్డాను. సరదా కంటే యిలా మారిందేఁవిటిరా భగవంతుడా అని బాధపడ్డాను. మాట మార్చాలిగదా అని –

"ఇల్లంతా యిలా వుందేం... మీ వాళ్ళంతా ఏరీ?" అన్నాను.

"అంతా పురాణానికి పోయేరు. వదిన పుట్టింటి కెళ్ళింది. అన్నయ్యేమో పట్నం వెళ్ళేడు."

"పురటాలి వొక్కర్తివే యింట్లో వున్నావా?"

"ఏం... పిల్లెత్తుకుపోతుందా?"

"ని న్నెవడెత్తుకుపోగలడే?"

"ఎముడు" అంటూ పకపక నవ్వింది. నా మనస్సు కలతబడింది.

"ఏఁవిఁటే ఆ మాటలు!" అని దాని భుజం పట్టుకున్నాను.

"వుండవే పిల్లా... నా కో చిన్న సాయం చేసిపెడుదూ."

"సాయం వా! నే చెయ్యగలిగిం దేమిటి?" అన్నాను.

"వుండు చెబుతాను," అని లోపలి కెళ్ళి చేతిలో కవ రొకటి పట్టుకొని తిరి గొచ్చి వీధిగుమ్మంలోకి వెళ్ళింది. అటూ యిటూ చూసి తలుపు గడియ బెట్టివచ్చి కవరులోంచి కాగితం మడత తీసి నా మీద పడేసింది. కవరు దిండు కింద దాచి మంచంమీద కూచుంటూ—

"చదివిపెట్టవే" అంది.

"ఓస్ యింతేనా ... యింకా ఏదో అనుకున్నాను "

"ఏం ... బరువులు మొయ్యాలని భయపడ్డావా?"

"అబ్బే!"

"చాల్చాలు గాని చదవ్వే."

"ఏమిటిది?"

"ఆమాత్రం తెలిస్తే నిన్ను బతిమా లడ మెందుకూ?"

ఆ కాగితం మడతవిప్పి చూసేను.

"ఇదేదో ఉత్తరం...నన్ను చదవ మంటా వేమిటే?''

"మ రెవర్ని చదవమనగల్నే... నువ్వే చది విపించు... చదు వొచ్చిం దానివీ అదృష్టవంతురాలివీను ... యీ వుపకారం చేసిపెట్టు."

నాకు చదవక తప్పిందికాదు. మొహ మాట పడిపోయేను.

"ఏమండీ - ఎన్నాళ్ళండీ న న్నిక్కడిలా వుంచేస్తారూ ... నా కన్నవా రిల్లు కటకటాల జోనులా మార్చేసేరండీ మీరు. ఎప్పుడూ వుంటే పుట్టిల్లుకూడా ఖైదుగా మారిపోతుందండీ ... మన బాబిగాణ్ణి ఎంత వేగంగా అత్తగారి చంక కందిద్దామా అని ఉవ్విళ్ళూరుతున్నా నండీ ... మామగార్నీ అత్తగార్నీ చూడాలని వుంది. ఆ వూరూ, ఆ పొలాలూ, మీరు మాటలలో చిత్రించే చక్కదనాలూ నేనూ చూసి ఆ ఆనం దాన్ని మీతో పంచుకోవా ల్నుందండీ... మీ రెందు కిలా జాప్యం చేస్తున్నారూ? నా యింటికి రావడానికి నా కేం సిగ్గు లేదు. నేనే మహరాణీలా వచ్చేస్తాను... కాని మీ రేవనుకుంటారో అని భయ పడుతున్నాను. అలా వచ్చేయడం మీ కిష్టమేనా చెప్పండి. మీ మర్యాదకి భంగం కాదా చెప్పండి. తొందరపడి వచ్చేస్తే మీకు కోపం వస్తుందేమో... నా బాధ మీ కెలా చెప్పనండీ...? చంటి వెధవని చూసి అంతా మీపోలికే అంటూ ఉన్నా రందరూ. ఆనాడు పుత్రోత్సా హంతో మీరు పురుటి గదిలోకి రాగానే నా కెందుకో వల్లమాలిన సిగ్గనిపించింది. ఏం చెప్పాలో తెలియక, ఎలా పలకరిం చాలో తోచక తడబడిపోయేను సుమండీ. పెళ్ళాన్ని ... మీ కిచ్చే కానుక ఎలా అందియ్యాలో చేతగాక ... పసి వాణ్ణి మీకు అందియ్యబోయి పొందికగా ఎత్తుకోలేక తొట్రుపడి కింద పడెయ్య బోయి 'హమ్మో' అని సద్దుకుని గుండెల

కదుముకున్నాను. అప్పు డేఁవన్నారో తెలుసా?... మీకు జ్ఞాపకం వుందో లేదో కాని నేను మాత్రం జన్మజన్మలకీ మరిచిపోలేను.

'తొలికాన్పు పసిపాప
సాకనేరని బాల
తెలవోయి పతి జూచి
కళవళించినదా!'

అన్నారు. ఎంత మంచి పాటండీ అది. ఆ మాటలలో తొణికిసలాడే ప్రాణం సోకి నా మనసు గెంతులేసింది. ఆ సమయంలో, మన గదిలో కిటికీ వుంది చూడండి... దాంట్లోంచి జొర బడదామని, రావడమా మానడమా అని ఊగిసలాడుతూ వూచలకి పేనవేసుకుని మాధవి...ఏదీ? మన మాధవండీ...మీరు తీగమీదే పువ్వుని వాసన చూస్తుంటారూ— ఆ మాధవి ఏం ఘుమఘుమ లాడిందను కున్నారూ...మన సరదాలన్నీ దొంగలా కిటికీలోంచి తొంగిచూస్తున్న మబ్బు తునక ఒయ్యారా లొలకపోస్తూ నా మనసులా గెంతుకుంటూ తెగ పరుగు లెత్తిందండీ... ఆ క్షణంలో మీ రవన్నీ చూడందే... మీ చూపులన్నీ నా మీదా. బాబిగాడిమీదాను. పిల్లాణ్ణి ఎత్తుకోలేని నా అవస్థ ఎలా పోల్చుకున్నారో గాని ఎంత చక్కగా, సున్నితంగా, చమత్కారంగా చెప్పగలిగేరండీ మీరు!... ఏఁవండీ...ఎప్పుడూ మీ దగ్గరే వుండి మీ నోట రాలే రత్నాలు ఒడిపట్టి ఏరుకో నివ్వరా?"

ఉత్తరం చాలా రసవత్తరంగా నడుస్తోంది. విశాలాక్షి మొహఁ వెందుకో చూడాలనిపించింది. ఇన్ని పులకలింతల పలకరాలు పలికిన దీని గుండె కోయిల గూడు అనుకున్నాను. ఉత్తరం చదవడం ఆపేసి దాని మొహంలోకి చూస్తుంటే సిగ్గుతో దాని కళ్లు బెదిరిపోయి రెపరెప లాడేయి. కొడుకుని తన మొగుడికి చూపించినపుడు దీని కళ్లు కందళించేయా, కదలులాడేయా అని ఆలోచిస్తూ దాని కాటుకకళ్ళవేపే చూస్తున్నాను.

"ఆపేసేవేం?... చదవ్వే... నా మొహంలో ఏఁవుందే అలా చూస్తావు?" అంది విశాలాక్షి.

"నీ కళ్ళెంత అందంగా వుంటాయే విశాలాక్షీ," అన్నాను.

"ఓహోహా... నీకూ కవిత్వం వస్తోందిలా గుందే...పోనీలే నీకేనా అందంగా కనిపించేయి."

"అదేఁవిటే అలా అంటావు నంగనాచీ...అంత మనసున్న మొగుణ్ణి పెట్టుకునీ."

"ఊఁ...బాగుంది వరస."

"అవును కానీ...నువ్వే రాసేవే ఈ ఉత్తరం...ఎంత ఝాణవయ్యేవే?"

"హయ్యో తెలివా...అంత బాగా ఉత్తరం రాయగలిగితే నాకిదేం కర్మఁవే?"

"అంటే?"

"నీ చేత ఉత్తరం చదివించుకునే గ్రహచారంఁ వేఁవీ అని."

"ఓహో అదా ... ఎవరి చేతో రాయించేవన్నమాట ... అవునే విశాలాక్షీ, యింత మంచిఆలోచనలు నీ కెలా వచ్చేయే అక్షరమ్ముక్క రాని నీకు?"

"ఎంత వెర్రిబాగుల్దానివే జానకీ... చదువుకోనివాళ్ళకి మనసుండదా, వూహలుండవా? వాళ్ళూ మనుషులేనా?... కడుపు పండగానే గుండె కూడా పండుతుందే ...అదొక చిలకల తొర్రలా మారిపోతుంది. తల్లి కాగానే ఆడదాని కో నిండుతనం వొస్తుందే ... అదెంత తియ్యగా వుంటుందో, అందులో పండే తేనెల రుచెలా వుంటుందో నేను రుచి చూసేను కాని నే నెలా చెప్పగలను చెప్పు?...అయినా అదెంత లేవే...రేపో మాపో నీకూ బోధపడుతుంది," అంటూ నా చెయ్యి తన చేతిలోకి తీసుకొని గాజులు సవరించింది.

"ఇంత మంచిమాట లెవరు నేర్పేరే నీకూ?" అని విస్తుపోయేను.

"మళ్ళీ అదే మాటా...ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కరి మనసు ముగ్గుతుంది...అంతే, ఒకరు చెప్పాలా?"

అని కొట్టిపారేసింది. ఆ ఉత్తరం అలా వుండిపోడం నాకు నచ్చలేదు. నేనైనే నలాంటి ఉత్తరం రాయలేను. ఆ ఉత్తరం దాని మొగుడి కెలాగేనా చేర్చాలని.

"బాగుంది, కాని ... యింత మంచి ఉత్తరం రాయించి పెట్లో దాచుకోడానికా ... వెర్రి మొహం వా ... వెంటనే పంపించెయ్యి ... మీ ఆయన మూర్ఛపోతాడు," అన్నాను.

"అబ్బే ... అదీ ... అదీ ... నేను పంపవలిసింది కాదు...అదీ..."అంటూ తటపటాయించింది.

"ఏం విం టే మరీనూ ... మొగుడికి రాయడాని కంత సిగ్గెందుకో...వెంటనే పంపెయ్యి."

"అదికాదే బాబూ..."

"ఏం విం టే?"

"అదీ నే రాసిందీ కాదు...రాయించిందీ కాదు...అదీ...మరేమో..."

"అదీ అదీ అదీ...ఏం విం టే నీ అదీ అదీనూ?" అని విసుక్కున్నాను.


"మరేంలేదే ... అదీ మా వదిన అన్నియ్యకి రాసింది."

"మరైతే నా నాచే తెందుకు చదివించేవే ... ఎంతపని చేసేవు ... పైవాళ్ళ ఉత్తరాలు చదవడం బాగుంటుందే..."

"పైవా ళ్ళెవరే... ఫరవాలేదులే ... అంతా ఆడవాళ్ళం వేగా చదివింది.

"అవుననుకో...ఎంత బాగా రాసిందే మీ వదిన!"

"వాళ్ళందుకే చిలకా గోరింకల్లా వుంటారు. ఆ బాబిగా డెంత అదృష్టవంతుడో - వాడి ముచ్చట్లన్నీ వాళ్ళమ్మ అంత తియ్యగా వినిపిస్తోంది. నేనూ వున్నాను... ఎందుకూ ... వుత్త మొద్దుని... అక్షరం రానిదాన్ని...కట్టు




కున్న వాడిమనసు నేవిధంగానూ మెప్పించ లేనిదాన్ని... అసలు నా లాంటివా ళ్ళెం దుకు బతకాలే జానకీ... యీ సోదె ఎప్పుడూ వున్న దేలే... మాటల్లోపడి మరిచిపోయేవు... ఉత్తరం పూర్తిగా చదవ్వే," అంది. నా కీమారు ఉత్తరం చదవాలనిపించింది. చదవకపోతే విశా లాక్షి వదలదుకూడాను. చదవకతప్పింది కాదు.

'ఏమండీ... మన బాబిగాడు కళ్ళు నులుపుకుంటూ గుప్పిట్లో కాటుకలు వుణికి మొహ మంతా పులుముకుంటుంటే పిచ్చివెధవ... కారుమబ్బుల మధ్య బూచిలా దోబూచులాడే చందమామలా వుంటాడండీ. వాణ్ణి ఏ అవతారంలో చూసినా మీరే గుర్తుకొస్తున్నారు. నా మనసంతా విప్పి చెప్పాలంటే నాలో అలుముకుంటున్న కొంగసిగ్గు... అబ్బ ప్రేమతో అవాంతరాలు పెడుతోం దండీ... చెప్పలేకపోతున్నాను. అర్ధ రాత్రి పక్కలో పాలు తాగి తాగి గుర్రు పెడుతూ కిసితీరా దొక్కలో తంతు న్నాడు పెంకివెధవ. వాడి కాలు తగి లినా, చెయ్యి తగిలినా నా కేవేవో జ్ఞాప కాని కొస్తున్నాయి. మరారాత్రి నా కింక నిద్ర పట్టదు... ఏమండీ అబ్బ... యిలాంటి విషయాలు ఆడదాన్ని... సిగ్గువిడిచి యింకెలా చెప్పను చెప్పండి? మిమ్మల్ని చూడకుండా నే నింక వుండ లేను. వెంటనే నన్నూ బాబిగాణ్ణీ తీసుకు పోండీ... మీ యింటికి తీసుకెళ్ళండీ... ఏమండీ వస్తారుగదూ...

ఇట్లు
నేనేనండీ...మీదాన్ని"

తలెత్తి చూసేను. విశాలాక్షి కళ్లు తుడుచుకుంటోంది.

"ఎందుకే కళ్ళొత్తుకుంటున్నావ్?" అని ఆశ్చర్యబోయేను.

"ఏంలేదే... మమకారం, అభిమానం... అంటే అలా వుండాలి... మనసులోవున్నది దాచుకుంటే ఎవరికేనా ఎలా తెలుస్తుందే?'' అని బాధపడింది విశాలాక్షి.

''బాగుంది... అందరూ అలా చెప్పగలరా... కాలున్నవారు నడవగలరేమో కాని చేతులున్నవాళ్ళంతా రాయగలరా, నోరున్నవాళ్ళంతా చెప్పగలరా?" అన్నాను.

''అందుకే కొంతమంది ప్రేమాభిమానాలకి నోచుకోరు."

"మీ వది నేం చదువుకుం దేఁవిఁటి? కవిత్వంకూడా అల్లుతుందా?"

"ఆఁ... చదువుకునే వుండాలిమరి."

"ఏం... నీకు తెలీదా?"

"చదువులు గురించి నాకేం తేలుసే.. ఏఁవేఁ జానకీ, నాకో వుపకారం చేసి పెడతావా?"

"ఏఁవిఁటే?"

"మా బాబుని చూస్తే నాకూ అలాగే అనిపిస్తుందే జానకీ. వాడి అరిపాదాలు తగిత్తే అవేవో పువ్వులంత మెత్తగా వుంటాయి. ఆ చిన్నవెధవ పెదాలు చూడు మావిడిచిగురులా ఎలావుందో.. ఏం తెలుసనో వాడినవ్వు... నాకూ లోపల యివన్నీ వినిపిస్తాయి. కళ్ళు మూసుకున్నా కనిపిస్తాయి. ఇవన్నీ ... నాకూ చెప్పుకోవాల నుంటుంది. జడ్డి మొహాన్ని అక్షరఁవేఁనా నేర్చుకోలేదు.. ఎలాగే?"

"మీ వదినదగ్గర పాటాలు నేర్చుకో," అని నవ్వేసేను.

"అలా నవ్వి నా ప్రాణాలు తియ్యక పోతే..."

"అవుతే నన్నేం చెయ్యమంటావే?"

"అలాంటి ఉత్తరం నా కోటి రాసి పెట్టరాదూ!"

"నీ కెందుకూ. మీ ఆయ నిక్కడే వుంటాడుగా... కొడుకుని చూడ్డానికి రాలేదావేం?"

"లేరు... పట్నంలో.. యింకా ఏదో చదువుతున్నారు."

"అలాగా... నే నలా రాయగలనో లేనో... అయినా తాపత్రయ పడతాను.. ఏం రాయమంటావో చెప్పు... అలాగే రాస్తాను"

"రాసిపెడతావా?... జానకీ చచ్చి నీ కడుపున పుడతానే... నీ ఋణం ఎలా తీర్చుకోగలను చెప్పూ," అంటూ లోపలికి వెళ్ళబోయింది విశాలాక్షి. ఇంతలో వీధితలుపు దడదడ చప్పుడైంది గాభరాగా ఉత్తరం నా చేతి లోంచి లాగేసుకొని, దిండుకింద దాచేసి వెళ్ళి తలుపు తీసింది. వాళ్ళమ్మ లోపలి కొస్తూ నన్ను చూసి ఒక్కక్షణం నివ్వెర బోయి గుమ్మంలోనే నిలబడిపోయింది.

"అబ్బో అబ్బో ... జానకమ్మే... ఎన్నాళ్ళ కెన్నాళ్ళకీ! ఏఁవేఁ పిల్లా, పెళ్ళికేనా వచ్చేవుకావు... ఎప్పుడొచ్చేవూ ... నువ్వొచ్చినట్టు మీ అమ్మేనా చెప్పలేదే" అని బుగ్గలు నొక్కుకుంటూ, గుక్క తిప్పుకోకుండా పలకరింపులూ, అభియోగాలూ ఏకరవుపెట్టింది.



"లేదుపిన్నీ, యిందాకే వచ్చేను. రాగానే మీ ఇంటికే వచ్చేను. మీ ఇంటికే కదా వెళ్ళేనని అమ్మ చెప్పివుండదు... అంతే," అన్నాను.

"మీ ఆయన కేంపనే.. ఎక్కడుంటున్నారు మీరు?"

"ఏం చెప్పను పిన్నీ... దేశం కాని దేశం...చాలా దూరం ... ఆ మనుషులూ ఆ భాష...అబ్బ పోనిస్తూ అదో లోకం_ఏదో వుద్యోగ రీత్యా ఆమూలనిపడున్నాం."

"పోనీలేఅమ్మా. దూరఁవోఁభారఁవో నువ్వూ మొగుడూ హాయిగా వున్నారు. ఎక్కడుంటున్నారో, ఎలా వుంటున్నారో అని కన్నపేగు వూరుకోపోయినా ... ఏదో...ఎక్కడో `అక్కడ మీరంతా బాగుండడఁవే కావాలి...మా కంతకన్న ఏంకావాలి చెప్పు..."

"అదేఁవిఁటి పిన్నీ ... ఆడవాళ్ళఁవైన తరవాత కన్నవారింట్లో ఎన్నాళ్ళుంటాం మరి! చెట్టయినా పుట్టయినా మొగు

డుతో పోవాల్సిందే మరి. రేపో మాపో విశాలాక్షి వెళ్ళిపోదూ...ఏం చేస్తాం."

"అదేం వెళ్తుందిలే అమ్మా ... దాని మొగుడు పట్నంలో కాపరం పెట్టేడు."

"ఆఁ ... ఎవరితో?" అని విస్తుపోయేను. వాళ్ళమ్మ వేపు కోరగా చూసింది విశాలాక్షి పకాల్మని నవ్వుతూ.

"చదువుతో ... మా అమ్మ హాస్యం అల్లుడిమీద దారితీసింది." అని నావేపు తిరిగి సమాధానం చెప్పింది. ఏదో అన బోయి వాళ్ళమ్మ విశాలాక్షి మొహం చూసి గతుక్కుపడిపోయింది. నాకంతా అగమ్యగోచరంగా వుంది. వెలవెల బోయి చూస్తున్నాను. నా అవస్త చూసి, బాగుండదనిగాబోలు "అమ్మాయి జానకీ, విశాలాక్షి కొడుకుని చూసేవా;" అని వాళ్ళమ్మే మాట మార్చింది.

"మావిడిపండు లాంటి మనవణ్ణెత్తేవు పిన్నీ...కాని అన్నయ్య కొడుకుని చూపించేవు కావు ... వాడెంత దబ్బ పండులా వుంటాడో!" అన్నాను.

"హయ్యో రాతా...నాకంత అదృష్టంవా తల్లీ.. కోడలు దాని కడుపు పండి ఒక్క కాయి కాస్తే పేరెట్టుకుంటానని ఎన్ని మొక్కులు మొక్కేనే అమ్మా. వెంకటరవణమూర్తికి ముడుపు కట్టుకున్నాను. సుబ్బారాయిడికి కొడుకునీ కోడల్నీ ప్రదక్షిణ చేయించేను. సింహాద్రప్పన్నకి భోగం చేయించేను, నాగ ప్రతిష్ట చేయించేను. ఒకటా రెండా అమ్మా నే చేసినవి ... నా గీతో ... ఏం లాభంవే తల్లీ, ఒక్క దేవుడికీ దయ రాలేదు.. నా కర్మే తల్లీ . నుదిటిరాత."

అంటూ నెత్తి బాదుకుంటూ వుస్సురంది. ఏంవింటిదంతా అంటూ ఆశ్చర్యబోతూ విశాలాక్షివేపు చూసేను. తలొంచుకుని కనురెప్ప లెత్తలేక కాలి బొటనవేలితో నేలమీద రాస్తూ చటాలున లోపలికి వెళ్ళిపోయింది. అకస్మాత్తుగా వెళ్ళిపోతున్న కూతురివేపు నివ్వెరపోయి చూస్తూ, తనుకూడా వెనకాతలే వెళ్ళిపోయింది వాళ్ళమ్మ. నా కేంవింటో ముళ్ళమీదున్నట్టనిపించింది. ఒక్కరినే ఏంవీం తోచక చంటివాడిబుగ్గలు నిమురుదామని వెళ్ళి పక్కమీద దిండు సర్దపోయేను: దిండుకింత చేతికి కవరు దొరికింది. తీసి చూసేను. ఆ కవరుమీద ఎడ్రసు విశాలాక్షి మొగుడిపేరు ఉంది.

తల తిరిగి నామనస్సు వికలంవైపోయింది. కాలికింద నేలకుంగిపోతున్నదనిపించింది. 'ఇంత ఆపద, యింత ఆవేదన దిగమింగి నిండుగా నవ్వుతూ, వస్తాడా, కనబడతాడా అని మొగడికోసం కళ్ళు కాయలుకాసేలా దిక్కులు కలయజూసి అభిమానించి, ప్రేమించి, ఆరాధించే విశాలాక్షి వర్షించని మేఘంవా ... నాచుమధ్య వడగొట్టిపోయి కమలిన కమలమా ... నవ్వే విషాదమా ... విధిని వెక్కిరించగలిగే ద్వేషమా? ఎవరీ విశాలాక్షి? తన మాంగల్యం మలినం కాకూడ

దని మొగణ్ణి పూసుకొచ్చే యీ విశాలాలాక్షి ఎవరు? నాతో అమాయకంగా గొబ్బిళ్లు పెట్టి బుజబుజరేకుల పాటలు పాడి, తాటేకు బొమ్మలపెళ్ళిళ్ళు చేసి, గుజ్జనగూళ్ళు ఆడిన బడబడబుచ్చి ఆ విశాలాక్షేనా యిది? ... ఎంత మారిపోయింది! అది అమాయకపు మొద్దు ఇది సమస్త అశుభాలు పలహారం చేసి, కార్చక తనలోనే యింకిపోయిన కన్నీళ్ళతో లోకాల్ని పునీతం చేయగల సర్వమంగళ. ఏం పాపం చేసిందని శిక్ష అనుభవిస్తోంది. దాని కింత అన్యాయ మెందుకు జరిగింది?' అని నాలో నేనే తర్కించుకుంటూ వాపోతున్నాను. నా బుర్రలో కోటానుకోట్ల దృశ్యాలు, సహస్రకోటి ప్రశ్నలూ పిశాచాల్లా అల్లరి చేస్తున్నాయి. కణతలు నొక్కుకుంటూ తలెత్తి చూసేసరికి జాలిగా కనురెప్ప లాడిస్తూ క్షమించమని కళ్ళతోనే ప్రాధేయపడుతూ నా ముందు బొమ్మలా నిలుచుంది విశాలాక్షి. నాకు దుఃఖం ఆగలేదు. దగ్గరకు తీసుకుని కౌగలించుకొని తల నివురుతూ బావురు మన్నాను. కౌగిలినుండి విడిపించేసుకుని, కళ్ళు తుడిచేసుకుంటూ సిగ్గుపూతో పెదాలు వంకలు తిరిగే చిరునవ్వు నవ్వుతూ నన్ను పీటీగుమ్మందాకా సాగనంపింది. అది వికటదని నవ్వు; కొండంత బరువైన నవ్వు; నిరాశలో మగ్గిపోయిన అభాగ్యురాలి అసహాయపు నవ్వు వాల్మీకి ఆశ్రమంలో తల దాచుకుని వేదనతో కుమిలిపోయిన సీతమ్మ నవ్వు; అగ్నిపర్వతపు గుండెల్లో సలసల మరిగే గంధకద్రవాల కుతకుతల నవ్వు; సముద్ర గర్భంలో బుడబుడ మనే, లోకాలను దహించే హాలాహల బడబాగ్నుల నవ్వు. దాని సెగలు భరించలేక, దాని బరువు మోయలేక గిర్రన తిరిగి నాలుగంగల్లో మాయింటికి పారిపోయేను.

నా కోసం మా అమ్మ భోంచెయ్యకుండా కాచుకూర్చుంది. నాకడుపు నిండిపోయింది. ఏం భోంచెయ్యను? మొదటి రోజు నే కన్నవారింట్లో భోంచెయ్యకపోతే ఏం రాద్ధాంతం చేస్తారో అని నాలుగు మెతుకులు కొరికి లేచిపోదామని పీటేసుకున్నాను. నెయ్యి వడ్డిస్తూ –

"ఏం వేం అమ్మాయ్, విశాలాక్షి కొడుకుని చూసేవా. బాగున్నాడా చంటి ముండ?" అంది మా అమ్మ

"వాడి కేంవేం ... దబ్బపండులా వున్నాడు," అని ముక్తసరిగా చెప్పి వూరుకున్నాను.

"దానొంట్లో బాగుందా ... అసలే పాపం అర్భకురాలు," అని మళ్ళీ వూరుకోకుండా కదిపింది మా అమ్మ.

"ఓ ... దానికేంవేం ... నిక్షేపంలా వుంది ఫ్రరటాలై దబ్బపండులాంటి కొడుకు నెత్తుకుంది."

అని మా అమ్మ మొహంలోకి చూసేను. ఏవీ పట్టించుకోకుండా మజ్జిగ పోసుకుంటోంది. ఆ మాటలు తనవేనని మా అమ్మకి గుర్తుంటేగా.

———